
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 22 జనవరి 2024





విజయనగరంలో శోభాయాత్రకు ముందు రామభక్తులు

అంతా రామమయం

అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ కోసం దేశమంతా ఎదురుచూస్తుండగా ప్రత్యేక పూజలకు జిల్లాలోని రామాలయాల్లో సర్వం సిద్ధమయ్యాయి. ఉత్సవ విగ్రహాల ఊరేగింపులు.. తిరువీధి వేడుకలు.. భజనలు.. రామ భక్తుల కోలాటాలు సోమవారం జరుగనున్నాయి. అంతా రామమయం కానుంది. జిల్లాలో అనేక పురాతన రామాలయాలు ఉన్నాయి. వాటన్నింటా ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. అందులో విజయ నగరంలోని కొత్తపేట కోదండ రామాలయం చాలా పురాతనమైంది. 150 ఏళ్లకు పైగా చారిత్రక నేపథ్యముంది. ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. సోమవారం స్వామి వారి తిరువీధి, భజన ఏర్పాటు చేశారు. బొబ్బిలి మండలం చింతాడ, గోపాలరాయునిపేట, పిరిడి, కింతలవానిపేట, అలజంగి, పారాది, మెట్టవలస తదితర ప్రాంతాల్లోని రామమందిరాలు కూడా పురాతనమైనవి. కింతలవానిపేట గ్రామంలో మహిళలు ఆదివారం ఊరేగింపు చేపట్టారు. కోమటిపల్లిలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రామభద్రపురం మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన రామ భక్తులు రామతీర్థం పుణ్యక్షేత్రానికి సోమవారం శోభాయాత్ర చేపడుతున్నారు. విజయనగరంలోని మార్వాడీలు మూడు లాంతర్లు నుంచి ఎన్‌సీఎస్ రోడ్డు వరకూ జై శ్రీరామ్ అంటూ నినాదాలు, రాముని పాటలతో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నెల్లిమర్ల మండలం రామతీర్థం రామస్వామి దేవస్థానం ప్రాంగణంలో కూడా సోమవారం శోభాయాత్ర జరుగనుంది.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)





బొబ్బిలి: చింతాడ గ్రామంలో పురాతన శ్రీరామ మందిరం

మరిన్ని వార్తలు 7లో

రేగిడిలో వైసీపీకి వరుస షాక్‌లు

● కోండ్రు ఆధ్వర్యంలో తాజాగా 300 కుటుంబాలు టీడీపీలో చేరిక

రేగిడి, జనవరి 21: రేగిడి మండలంలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఒక గ్రామం చూసి మరో గ్రామం వారు ఆ పార్టీకి బైబై చెబుతున్నారు. ఇప్పటికే మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆ పార్టీ దాదాపు ఖాళీ అయింది. తాజాగా ఆదివారం కొండవలస, లక్ష్మీపురంలో కలిపి 300 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం స్వీకరించాయి. కొండవలస మాజీ సర్పంచ్ తుమ్మి పద్మావతి, లక్ష్మిపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో వారంతా పార్టీ మారారు. రాజాం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మీపురం నుంచి విద్యాకమిటీ ఛైర్మన్ కర్ణేన గౌరినాయుడు, వార్డు మెంబర్ బాలి సన్యాశిమ్మ, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు బాలి సూర్యానారయణ తదితర 150 కుటుంబాలు చేరగా, కొండవలస నుంచి బెవర జానకీరావు, బెవర వెంకటరమణ, రామారావు, కాశీవిశ్వనాధం, భాస్కరరావు తదితరులు టీడీపీలో చేరారు.





కొండవలసలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కోండ్రు, (ఇన్‌సెట్)లో లక్ష్మిపురం సమావేశానికి హాజరైన ప్రజలు

23న వైఎస్ షర్మిల జిల్లా పర్యటన



రింగురోడ్డు, జనవరి 21: కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజయనగరంలో పర్యటించనున్నారు. 23న జిల్లాకు వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సుంకరి సతీస్‌కుమార్‌లు ఆమె పర్యటనను ధ్రువీకరించారు. పర్యటనలో భాగంగా ఆ రోజు మధ్యాహ్నం జిల్లా నాయకులు, మండల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించ నున్నారని తెలిపారు. షర్మిల పర్యటనకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోందని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.



విజయనగరం వన్‌టౌన్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో అంగన్వాడీలు



బొబ్బిలి: లగేజీ వ్యానులో వెళ్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల నిర్బంధం

● చలో విజయవాడ భగ్నం ● గృహాల వద్దే అడ్డగింత

● ఎక్కడికక్కడ అరెస్టులకు దిగిన పోలీసులు

విజయనగరం(ఆంధ్రజ్యోతి) జనవరి 21: అంగన్వాడీల చలో విజయవాడను భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడే వారిని ఆదివారం నిర్బంధించారు. ప్రధాన నాయకులను స్వగృహాల వద్దే అడ్డుకున్నారు. విజయవాడ పయనమైన వారి సమాచారం తెలుసుకుని అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్లు, బస్‌కాంప్లెక్స్‌పై నిఘా పెట్టి అక్కడకు వచ్చిన వారిని స్టేషన్లకు తరలించారు. దీనిపై అంగన్వాడీ కార్యకర్తలు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. ఎన్ని మార్గాల్లో అడ్డుకున్నా తాము వెనక్కు తగ్గబోమని హెచ్చరించారు. మరోవైపు 41వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం కూడా నిరసన కొనసాగించారు. విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద సీఎం జగన్, మంత్రులకు, అధికారులకు అంగన్వాడీలు వంగివంగి నమస్కరిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.

చలో విజయవాడ కార్యక్రమానికి రాష్ట్రనాయకులు ఇచ్చిన పిలుపుమేరకు వివిధ ప్రాంతాల నుంచి అంగన్వాడీలు ఆదివారం విజయవాడ బయలుదేరారు. ఈ విషయం ముందే తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్నిచోట్లా నిఘా పెట్టారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో 19మందిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా కమిటీ నాయకురాలు బి.సుధారాణిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం భయపడి మమ్మల్ని నిర్బంధించి, అరెస్ట్ చేస్తోందని, ఇప్పటికే వేలాది మంది విజయవాడ చేరుకున్నారని అన్నారు. మహిళా శక్తి ఏమిటో ఎన్నికల్లో జగన్, వైసీపీ నేతలు రుచి చూస్తారన్నారు.

వ్యాన్‌లో చలో విజయవాడకు..

బొబ్బిలి : విజయవాడ వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్న నేపథ్యంలో వారి నుంచి చాకచక్యంగా తప్పించుకుని అంగన్వాడీలు బొబ్బిలి నుంచి బయలుదేరి వెళ్లారు. లగేజీ వ్యానులో వెళ్తున్నారు.

గరివిడి: అంగన్వాడీ కార్యకర్తలను గరివిడి స్టేషన్‌లోనూ నిర్బంధించారు. యూనియన్ నాయకురాలు వరలక్ష్మీతో సహా మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నారు.

చీపురుపల్లి: యూనియన్ ప్రతినిధి ఎస్.నాగమణిని చీపురుపల్లి పోలీసులు ఆదివారం గృహ నిర్బంధంలో ఉంచారు.

గజపతినగరం: ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు సుభాషిణిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేశారు.

శృంగవరపుకోట/జామి : శృంగవరపుకోట అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మద్ది మాణిక్యాన్ని ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్ట్ చేశారు. జామిలో ఇద్దరు అంగన్వాడీలను ముందస్తుగా అరెస్ట్ చేసి నోటీసులు ఇచ్చారు.



సీఎం, మంత్రులకు వంగి వంగి నమస్కరిస్తూ అంగన్వాడీల నిరసన

నేటి నుంచి శంబరం

● తొలేళ్లకు ఏర్పాట్లు పూర్తి .. రేపు సిరిమానోత్సవం

● భారీగా తరలిరానున్న భక్తులు



సాలూరు రూరల్/మక్కువ, జనవరి 21: శంబరలో సందడి మొదలైంది. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతరలో తొలి అంకమైన తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం రాత్రి సంప్రదాయబద్ధంగా ఈ వేడుకను నిర్వహించనున్నారు. ఈ నెల 23న సిరిమానోత్సవం, 24న అంపకోత్సవం జరగనుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి భక్తుల లక్షలాదిగా తరలిరానున్న నేపథ్యంలో దేవదాయ శాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులకు పోలమాంబ శీఘ్ర దర్శన భాగ్యం కల్పించనున్నారు. మరోవైపు గ్రామంలో చురుగ్గా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. 70 వేల లడ్డూలను తయారు చేయిస్తున్నారు. రద్దీ, జాతరకొచ్చే భక్తుల పర్యవేక్షణకు రెండు డ్రోన్ కెమెరాల వినియోగించనున్నారు. కాగా తొలి జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పోలమాంబ దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. పది వారాల పాటు జాతర నిర్వహించనున్నామన్నారు.

● జాతరలో ప్రత్యేకంగా బాడీ వేర్ కెమెరాలతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిమానోత్సవం రోజున రెండు డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు. ఐదుగురు డీఎస్పీలు , 15 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు, దాదాపు 600 మంది భద్రతా సిబ్బంది విధుల్లో ఉంటారు.

● శంబర సమీపంలో గున్నాం కొండ వద్ద గుర్తించిన సిరిమాను తాడి చెట్టును, బట్టివలస వద్ద గుర్తించిన గుజ్జుమానును ఏరువాక ద్వారా శంబర గ్రామంలోకి తీసుకొచ్చారు. దానిని సిరిమానుగా సోమవారం తయారు చేయనున్నారు.

● శంబర జాతర సందర్భంగా 150 ఆర్టీసీ బస్సులను వివిధ ప్రాంతాల నుంచి నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం


● ట్రాక్టర్‌ను ఢీకొని అన్నదమ్ముల దుర్మరణం

● పొగమంచే కారణమా? ● గొల్లపేటలో విషాదం

పూసపాటిరేగ, జనవరి21: వారిద్దరూ స్వయాన అన్నదమ్ములు. ఒకే మాటగా.. ఒకే బాటగా ఉంటూ తోడుగా ముందుకెళ్తుండేవారు. ఐక్యంగా నిర్ణయాలు తీసుకునేవారు. వారి కలివిడితనాన్ని అందరూ అభినందించేవారు. ఆ అన్యోన్యతను చూసిన విధికే కన్ను కుట్టిందేమో ఇద్దరి ప్రాణాలనూ ఒకేసారి తీసుకుపోయింది. పూసపాటిరేగ శివారు గొల్లపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు నక్కాన రమేష్‌కుమార్(24), సురేష్‌కుమార్(26)ల విషాదాంతమిది. ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తుండగా ఆదివారం ఉదయం ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



సురేష్‌కుమార్(ఫైల్)



రమేష్‌కుమార్(ఫైల్)


గొల్లపేటకు చెందిన ఆదిలక్ష్మి, రాముల కుమారులు నక్కాన రమేష్‌కుమార్, సురేష్‌కుమార్‌లు విశాఖ జిల్లా పరవాడలోని ఓ పరిశ్రమలో కెమిస్టులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. సంక్రాంతి పండగకు ఇద్దరూ కలిసే స్వగ్రామానికి వచ్చారు. ఎరుకొండలో ఉన్న అమ్మమ్మ ఇంటికి ఇటీవల వెళ్లారు. ఆదివారం తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. వ్యవసాయం పనుల కోసమని ఉదయానే పయనమయ్యారు. సుమారు 6గంటల ప్రాంతంలో పేరాపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. మంచు దట్టంగా కురుస్తుండటంతో ట్రాక్టర్ కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి ఎస్ఐ బాలకృష్ణ చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురు పిల్లలూ దక్కని వైనం

గొల్లపేటకు చెందిన రాము, ఆదిలక్ష్మి పరిస్థితి దయనీయం. వీరికి ముగ్గురు సంతానం కాగా గత ఏడాది కూతురు మృతిచెందింది. ఇప్పుడు ఉన్న ఇద్దరు కుమారులనూ కోల్పోవడంతో వారి రోదన వర్ణనాతీతం. గుండెలవిసేలా విలపిస్తున్నారు.

నేడే ఓటర్ల తుది జాబితా విడుదల

కలెక్టరేట్, జనవరి 21: ఓటర్ల తుది జాబితాను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలు వెల్లడికానున్నాయి. ప్రతి ఏడాది ఓటర్ల తుది జాబితా జనవరి 5న విడుదల అయ్యేది. ఈసారి విడుదల ప్రక్రియను 22వ తేదీకి ఎన్నికల కమిషన్ మార్పు చేసింది. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా గత ఏడాది అక్టోబరు 27న విడుదల చేసిన డ్రాఫ్ట్ రోల్ ప్రకారం జిల్లాలో 15,17,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,50,056 మంది, మహిళలు 7,67,207 మంది, థర్డ్ జెండర్ 102 మంది ఉన్నారు. ఆ జాబితాపై వివిధ గ్రామాల నుంచి అనేక అభ్యంతరాలు వచ్చాయి. జీరో డోర్ నెంబర్లు, ఒకే డోర్ నెంబరుపై వివిధ కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు డ్రాఫ్ట్ రోల్‌లో కన్పించాయి. మృతి చెందిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు కూడా ఉన్నారు. ఇవే కాకుండా ఓట్ల తొలగింపునకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నోటీసులు ఇవ్వకుండా జాబితాల్లో నుంచి పేర్లు తొలగించారంటూ కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై సుదీర్ఘ విచారణ జరిగాక చివరి జాబితా తయారైంది. తుది జాబితా ద్వారా ఓటర్లు కొత్తగా ఎంత మంది పెరిగారు? అనేది తెలియనుంది.



200 మద్యం బాటిళ్లతో వలంటీర్

● అరెస్టు చేసిన పోలీసులు ● వల్లూరులో బెల్ట్‌షాపు నడుపుతున్న వైనం

నెల్లిమర్ల, జనవరి 21: బెల్ట్‌షాపు నడుపుతున్న వలంటీర్ బాగోతం బయటపడింది. నెల్లిమర్ల ఎస్ఐ రామగణేష్, సిబ్బంది ఆదివారం జరిపిన దాడుల్లో ఇదే మండలం వల్లూరు గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న నేరెళ్ల సత్యన్నారాయణ అలియాస్ సతీష్ సుమారు 200 మద్యం బాటిళ్లతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపడ్డాడు. మద్యం బాటిళ్లను, వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేశారు. వలంటీర్ కొంతకాలంగా బెల్ట్‌షాపు నడుపుతున్నాడు. వలంటీర్ ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని దందా సాగిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఐదు రోజుల కిందట ఎస్ఐగా బదిలీపై వచ్చిన రామగణేష్ బెల్ట్‌షాపులపై దృష్టి సారించి వరుస దాడులు చేపట్టడంతో వలంటీర్ అడ్డంగా బుక్కయ్యాడు. వలంటీర్‌తో పాటు అధికార పార్టీ కార్యకర్త నాగ్‌ను కూడా పట్టుకున్నారు.



పోలీసుల అదుపులో వలంటీర్ సతీష్, వైసీపీ కార్యకర్త



అంతటా రామనామమే..

- అయోధ్యలో నేడు బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ
- జిల్లాలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు



విజయనగరంలోని మూడులాంతర్ల వద్ద మార్వాడీల భారీ ర్యాలీ..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఊరూ వాడ.. అయోధ్యరాముని ఊసే. జిల్లా అంతటా శ్రీరామ.. జయ రామ అంటూ కీర్తనలే వినిపిస్తున్నాయి. ఆనాడు శ్రీరామచంద్ర మూర్తి పట్టాభిషేకం ఎంత ప్రాముఖ్యత సంతరించుకుందో నేడు అయోధ్యలోని రామాలయం ప్రారంభోత్సవానికి అంతే ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా హిందూ సంఘాలు, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సేవా సంఘాలు ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని మార్వాడీలంతా కలిసి మూడు లాంతర్ల నుంచి ఎన్‌సీఎస్ రోడ్డు వరకూ జై శ్రీరామ్ అంటూ నినాదాలు, రాముని పాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు. విజయనగరం రామనారాయణం, రామతీర్థంతో పాటు బొబ్బిలి, ఎస్‌కోట, గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, గంట్యాడ, గరివిడి, చీపురుపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న అన్ని రామాలయాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం భజన, తిరువీధి ఊరేగింపు చేపట్టనున్నారు. ఆయా రామాలయాల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి జెండాలు పంచి, ఆయా ఇంటిపైన రాముని జెండాలు వుంచే విధంగా ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాముని ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా వీక్షించేందుకు తెరలు ఏర్పాట్లు చేశారు.



ఇంటింటికీ జెండాలు పంపిణీ చేస్తున్న కోదండ రామాలయ కమిటీ..

విజయనగరంలో ఎన్నో ఆలయాలు

విజయనగరం రూరల్: నగరంలో వందేళ్ల పూర్తి చేసుకున్న రామాలయాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటి కంటే పురాతనమైనది కొత్తపేట కోదండ రామాలయం. ఈ రామాలయం ఏర్పడి 150 ఏళ్లకు పైగా అవుతుందని స్థానిక వృద్ధులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో కులవృత్తులు చేసుకునే యాదవులు, వండ్రంగి పనివారు అంతా కలిసి రామమందిరం నిర్మించి, పూజలు నిర్వహించేవారు. పురాతన ఆలయం కావడంతో కొన్నాళ్ల ఆ ఆలయం 1980 నుంచి 1985 కాలంలో శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు దానికి మరమ్మతులు చేసి రామమందిరాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఆ ఆలయంలో నిత్యపూజలు, ఆలయాన్ని ఆధునికీకరిచడంతో పాటు, విరాళాలతో ఆ ఆలయంలో ఇప్పుడు ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా అయోధ్యలోని రాముని ఆలయం ప్రారంభోత్సవం కారణంగా ఇంటింటికీ జెండాలు ఏర్పాటు చేయడంతో పాటు, సోమవారం స్వామి వారి తిరువీధి ప్రదర్శన, భజన కార్యక్రమాలను ఆ రామమందిరంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇదే రామమందిరం ప్రాంగణంలో అయోధ్యలో నిర్మితమైన రామాలయానికి స్థానికులు ఇటుకలు కూడా ఇక్కడ నుంచి పంపించారు.. 1991లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీతో పాటు, స్థానికులు కూడా ఎక్కువ సంఖ్యలో ఇటుకలను పంపించారు.

● నగరంలోని కొత్తపేట కోదండ రామాలయంతో పద్మ సాలివీధి రామాలయం, పల్లివీధి సీతారామాలయం, ఇప్పిలివీధి రామాలయం, చిక్కాలవీధి రామమందిరం, దాసన్నపేటలోని పురాతన ఆలయం, వీటి అగ్రహారం, కణపాక, లంకవీధి, జొన్నగుడ్డి, లంకాపట్టణం, పుచ్చలవీధి, హుకుంపేట ఇలా పలు ప్రాంతాల్లో పురాతన రామాలయాలు ఉన్నాయి. వందేళ్ల చరిత్ర వున్న ఈ ఆలయాలు 1980 ఆ ప్రాంతంలో శిథిలావస్థకు చేరుకోగా, కమిటీ, స్థానికులు కలిసి దాతల విరాళాలతో ఈ ఆలయాలకు కొత్త రూపు తీసుకువచ్చారు.



తోటపల్లిలోని శ్రీకోదండ రామాలయం

తోటపల్లి ఆలయంలో...

గరుగుబిల్లి: ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో 1970 సంవత్సరంలో తోటపల్లిలో ఆలయాన్ని నిర్మించారు. తదుపరి 1980లో రామాలయం దేవాదాయశాఖ పరిధిలో చేరింది. మూడు జిల్లాల పరిధిలో తోటపల్లి రామాలయానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఏటా శ్రీరామ నవమి, ముక్కోటి ఏకాదశి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు సమయంలోనే భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. రేపు యథావిధంగా ఆలయంలో పూజలు చేయనున్నారు.



కోమటిపల్లి గ్రామంలో శ్రీరామమందిరం

శ్రీరామ భక్తుల్లో పులకింత..

బొబ్బిలి: శ్రీరామచంద్రుడు అంటే ధర్మనిరతికి, త్యాగానికి, పరాక్రమానికి, శ్రేష్ఠమైన పరిపాలనకు ప్రతీకగా యావన్మంది కొలుస్తారు. శ్రీరామమందిరం, రామభజన లేని గ్రామాలు అంటూ ఈ సమాజంలో ఉండవని నానుడి.

● బొబ్బిలి మండలం చింతాడ, గోపాలరాయునిపేట, పిరిడి, కింతలవానిపేట, అలజంగి, పారాది, మెట్టవలస తదితర ప్రాంతాలలో పురాతన రామమందిరాలు దర్శనమిస్తాయి. శని, సోమవారాలు, ఉగాది, సంక్రాంతి, వినాయకచవితి, శ్రీరామనవమి తదితర పర్వదినాలలో శ్రీరామ మందిరాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఇక్కడ శ్రీరామభజనలు, బైరో భజన (తాళాలతో చేసేది), చెక్క భజన (నిలుచొని లయ బద్ధంగా జానపదంలో పాటలు పాడుకుంటూ అడుగులు వేస్తూ చేసేది), కోలాటం వంటివి నిర్వహిస్తుంటారు.

● కింతలవానిపేట గ్రామంలో మహిళలు కోలాటంతో పాటు శ్రీరామభజన చేయడం ఓ ప్రత్యేకత. సోమవారం అయోధ్యలో శ్రీరామమందిర ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆ గ్రామంలో మహిళలు ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. కోమటిపల్లిలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బొబ్బిలిలో సోమవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించనుండగా, చినబజారు సెంటరులోని శ్రీరామమందిరంలో రామభజనలు, పూజలు, ఊరేగింపు కార్య క్రమాలు నిర్వహించనున్నారు. రామభద్రపురం మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన శ్రీరామభక్తుడు కందిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 600 మంది భక్తులు రామతీర్థాలు పుణ్యక్షేత్రానికి శోభాయాత్ర నిర్వహించనున్నారు.



ఎల్.కోటలో గల అతి పురాతన రామాలయం

ఎల్‌కోట సీతారామాలయంలో..

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోటలో వెలసిన శ్రీసీతారాముల ఆలయంలో నిరంతర పూజలతో శ్రీరాముడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. సుమారు 759 ఏళ్ల క్రితం నాటి ఈ ఆలయం క్రీస్తుశకం 12వ శతాబ్దంలో వెలసినట్లు పురాణాలు చెబుతున్నాయని వంశపారంపర ధర్మకర్త శ్రీనాథు పెదబాబు తెలిపారు. భద్రాచలంలో మాదిరి సీతారాముల విగ్రహాలు ఇక్కడా వెలిశాయి. ఈ ఆలయంలో సీతారాముల తోపాటు వెంకటేశ్వర, జగన్నాథ, విష్ణువు, అండాల్ విగ్రహాలు ఉన్నాయి. ఈ మండలంలో పురాతన, సనాతన రామాలయాలు సుమారు 23 వరకు ఉన్నాయి. సోమవారం యథా విధిగానే పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాజాంలో శోభాయాత్ర..

రాజాం రూరల్: శాస్తా సమాజం పీఠాధిపతి ఉమాపతి శేషు గురుస్వామి ఆధ్వర్యంలో రాజాంలో ఆదివారం అయ్యప్పభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పురవీధుల్లో జై శ్రీరాం అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులతో పాటు పట్టణ ప్రముఖులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజాంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

తప్పెటగుళ్ల బృందానికి అరుదైన అవకాశం..

మక్కువ: దేశమంతా ఎదురుచూస్తున్న అయోధ్య శ్రీరామమందిర నిర్మాణం పూర్తయి బాలరాముని ప్రతిష్ఠ మహోత్సవం నేడు జరగనుంది. ఇటువంటి కార్యక్రమంలో మక్కువ మండలం, వెంకటభైరిపురం గ్రామానికి చెందిన శ్రీ సాయి తప్పెటగుళ్ల కళాకారుల బృందం ఈ నెల 18 నుంచి 22 వరకు అయోధ్యలో ప్రదర్శన నిర్వహిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వాసులుగా అయోధ్యలో ఇలా ప్రదర్శన ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తప్పెటగుళ్ల కళాకారుల బృందం గురువు అల్లు వెంకటరమణ అన్నారు.



అయోధ్యలో ప్రదర్శన చేస్తున్న తప్పెటగుళ్ల బృందం

రామతీర్థానికి నేడు శోభాయాత్రగా..

నెల్లిమర్ల: జిల్లాలోనే అత్యంత ప్రఖ్యాతి గాంచిన ఆలయం రామతీర్థం. ప్రసిద్ధ పుణ్య క్షేత్రం, పర్యాటక స్థలం ఇక్కడి రామస్వామి వారి దేవస్థానం. ఈ ఆలయానికి సుమారు 500 సంవత్సరాల చరిత్ర ఉంది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం శ్రీరాముని ఆలయం తర్వాత రామతీర్థం ఆలయమే ప్రముఖ రామాలయంగా పేరు గాంచింది. అయోధ్యలో శ్రీరామ మందిరంలో ఈ నెల 22న జరగబోయే శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ ను పురస్కరించుకుని రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి శోభాయాత్రను నిర్వహించేందుకు రంగం సిద్ధం అయింది. శ్రీరామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో నెల్లిమర్లలోని రామతీర్థం జంక్షన్ నుంచి సోమవారం ఉదయం వేలాది మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు రేగాన గోవిందరావు, విజయ్‌కుమార్ తదితరులు వెల్లడించారు. ఆదివారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. తామస్‌పేట దుర్గాపీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద స్వామి ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులతో ఈ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం కొనసాగే ఈ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు దారిమధ్యలో తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రామచంద్ర స్వామి దర్శనం తర్వాత ఉచిత అన్న ప్రసాద వితరణ ఏర్పాటుచేసినట్లు వివరించారు ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ప్రతినిధులు ముంతా ప్రసాద్, భోగాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డబ్బివీథిలో రామమందిరం

సాలూరులో 70 ఏళ్లగా రామోత్సవాలు..

సాలూరు రూరల్: సాలూరులో పెదకోమటిపేటలో నిర్మించిన రామాలయం 70 ఏళ్లకు పైగా శ్రీరాముని ఉత్సవాలతో అలరాలుతోంది. సాలూరులో 1950 దశకంలో అప్పటి ఆర్యవైశ్య ప్రముఖులు ఉల్లి కామరాజు, లక్ష్మీకాంతమ్మలు ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తు వస్తున్నారు. అయోధ్యలో దివ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

గుళ్ల సీతారాంపురం ఆలయంలో..

రాజాం: సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురంలో ఉన్న సీతారాముల ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 16వ శతాబ్దంలో బొబ్బిలి రాజవంశీయులు ఆలయాన్ని కట్టించినట్టు స్థల పురాణం చెబుతోంది. విహార యాత్రతో పాటు అడవీ మృగాలను వేటాడేందుకు బొబ్బిలి రాజులు ఈ ప్రాంతానికి వచ్చేవారు. రాజుల కలలో సీతారాములు కనిపించడంతో ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. ఇక్కడ కేవలం సీతారాముల విగ్రహాలే ఉంటాయి. అందుకే ఆలయానికి ఏకాంత సీతారాముల ఆలయం అని పేరు. ఆలయ గోడలపై సింహపుతలల నగిషీలు, ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రాచీన భారత శిల్పకళా సౌందర్యానికి, నాటి అర్కిటెక్ట్ నైపుణ్యానికి అద్దం పట్టేలా కట్టడాలు, నిర్మాణాలు ఉంటాయి. ఏకరాతితో కూడుకున్న పెద్దపెద్ద శిలలతో ఈ ఆలయం చూడముచ్చటగా ఉంటుంది. రాజాం నియోజకవర్గానికి సంబంధించి వంగర మండలంలోని సంగమేశ్వరాలయంతో పాటు గుళ్లసీతారాంపురంలోని సీతారాముల ఆలయాలు పురాతనమైనవి. మడ్డువలస రిజర్వాయర్ చెంతనే సంగమేశ్వరాలయం ఉంటుంది. కార్తీక మాసంలో అయితే పవిత్ర నదీ జలాల్లో స్నానం ఆచరించి సంగమేశ్వరుడ్ని దర్శించుకుంటారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం చేపట్టనున్నారు.



రామతీర్థం ఆలయం



గుళ్ల సీతారంపురం ఆలయ గాలి గోపురం

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న బంగార్రాజు

పూసపాటిరేగ: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పూసపాటిపాలెం గ్రామంలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ హయాంలో నాణ్యమైన మద్యం సరఫరా చేశారని, నేటి ప్రభుత్వం నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటోందని ఆరోపించారు. ఆర్టీసీ చార్జీలు, కరెంట్ చార్జీలు ఇలా అన్నింటా బాదుడే అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, భోగాపురం మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రౌతు సోమినాయుడు పాల్గొన్నారు.

సత్సంబంధాలతోనే ఉద్యోగుల మనుగడ

● చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి



రవికుమార్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ తదితరులు

రాజాం రూరల్: విధి నిర్వహణలో ఉద్యోగుల మను గడ మానవ సంబంధాలతోనే ముడిపడి ఉంటుందని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి స్పష్టం చేశారు. తక్కువ కాలంలో అన్నివర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందడం కొద్దిమందికే సాధ్యపడుతుందన్నారు. ఇక్కడి తృప్తి రిసార్ట్స్‌లో పార్వతీపురం బదిలీపై వెళ్తున్న రాజాం టౌన్ సి.ఐ. కె.రవికుమార్ దంపతులను పట్టణానికి చెందిన పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, స్వచ్ఛంద సంస్థలతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించి సన్మానించారు. రాజాం ప్రాంత ప్రజలు ఆదరాభిమానాలు మరువలేనివని రవికుమార్ తెలిపారు. విశాఖ రైల్వే డీఎస్పీ మోహనరావు, బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, చీపురుపల్లి సి.ఐ. ఉపేంద్రరావు, రాజాం రూరల్ సి.ఐ. ఎస్.శ్రీనివాసరావు, ఎస్.ఐ.లు వైకాపా, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు దళితుల సానుభూతి దక్కదు



మాట్లాడుతున్న వనజాక్షి

నెల్లిమర్ల: నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి సానుభూతి కోసం సీఎం జగన్మోహనరెడ్డి విఫలయత్నం చేస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి విమర్శించారు. నెల్లిమర్లలోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంత పెద్ద విగ్రహం ఏర్పాటు చేసినా సీఎం జగన్‌కు దళితుల సానుభూతి దక్కదని ఆమె పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో విజయం సాధించేందుకు కోడి కత్తి శ్రీనును ఉపయోగించుకుని సానుభూతి పొందిన జగన్.. శ్రీనును బలిపశువును చేశారని అన్నారు. కోడి కత్తి దాడిని చంద్రబాబుపై తిప్పేందుకు ప్రయత్నించిన జగన్.. కోడి కత్తి శ్రీను జగన్ విధేయుడని బయటి ప్రపంచానికి తెలియడంతో అభాసుపాలయ్యాడని ఆమె వివరించారు. డాక్టర్ సుధాకర్, రాజమండ్రిలో వరప్రసాద్, జడ్డి రామకృష్ణ, తహసీల్దార్ వనితమ్మ ఎన్ని బాధలు పడ్డారో రాష్ట్ర ప్రజలకు తెలుసునని వనజాక్షి ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కింతాడ కళావతి, పార్టీ నాయకురాళ్లు ఎడ్ల లక్ష్మి, పొడుగు కృష్ణవేణి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేత రాములు

బొబ్బిలి: విద్యార్థులకు సీబీఎస్సీ సిలబస్ కాకుండా స్టేట్ సిలబస్‌నే బోధించాలని ఏపీటీఎఫ్ సీనియర్ నేత డోకల రాములు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీవో హోంలో ఆదివారం సాయంత్రం మహిళా నేత బొత్స పద్మావతి అధ్యక్షతన జరిగిన ఏపీటీఎఫ్ జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వర్తింపజేయాలన్నారు. 117 జీవోను రద్దు చేసి మాతృభాషలోనే విద్యాబోధనను పునరుద్ధరించాలని, మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ నంబర్లను కేటాయించాలని, సర్వీసు రూల్స్‌ను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండాట పేరిట జాతరలో జూదం

రాజాం: సంతకవిటి మండలం సురవరంలో బాల అన్నమ్మ పేరంటాల యాత్ర సందర్భంగా శనివారం నుంచి పెద్ద ఎత్తున జూదం నిర్వహిస్తున్నారు. ఈ జాతర మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఏటా దేవాలయానికి సమీపంలో ఈ జూదాన్ని ఎర్ర గుండు, పచ్చగుండు ఆట పేరిట నిర్వహించి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటారు. చిన్న చిన్న జూదాలని అరికట్టే పోలీసులు భారీస్థాయిలో జరుగుతున్న గుండాట వంటి జూదాలను అరికట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ● జూదం ఆడుతున్న విషయంపై ఎటువంటి సమాచారం లేదని, సంతకవిటిలో ఎస్సై లేనందున ప్రత్యేక దృష్టిపెట్టడంలేదని రాజాం సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ ఇక ఇంటికే..



మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట, జనవరి 21: వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఇక ఇంటకి వెళ్లడం ఖాయమని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఆమె టీడీపీ నేతలతో కలిసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్‌కు ఇచ్చిన గౌరవం ఇక ముగిసిందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని లూటీ చేశాడని విమర్శించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని ఎద్దేవ చేశారు. రైతులకు బోర్లు అన్నాడు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నిధులన్నాడు, మద్య నిషేధమన్నాడు, సీపీఎస్ రద్దన్నాడు, నిరుద్యోగ భృతన్నాడు, 30 లక్షల ఉద్యోగాలన్నాడు. ఇవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రతీ వ్యక్తికి సుమారు 3 లక్షల అప్ అప్పుజెప్పాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు కేవలం 25 సీట్లుకన్నా ఎక్కువ రావన్నారు. ఈ కార్యక్రమంలో కోళ్ల ।ను, నాలం అర్జునరావు, అయ్యరక సంఘ నాయకులు బి.వి.రమేష్, నక్కరాజు చినరాము, రత్నాజీ తదితరులు హాజరయ్యారు.

మహానేత లెనిన్





విజయనగరం, బొబ్బిలిలో నివాళి అర్పిస్తున్న కమ్యూనిస్ట్ నాయకులు

విజయనగరం దాసన్నపేట: మానవాళి విముక్తికి మార్గం చూపిన మహానేత లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అన్నారు. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, జగన్మోహన్, బి రమణ తదితరులు పాల్గొన్నారు .

బొబ్బిలి: ప్రపంచ ప్రప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఐవీ లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, కోట అప్పన్న, దళితహక్కుల పోరాట సమితి నాయకుడు బొద్దాన శ్రీనివాస్ తదితరులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పేకాడ శిబిరాలపై దాడి

రాజాంరూరల్: రాజాం మున్సిపాలిటీ పరిధిలో పునుగుటివలసలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దాడుల్లో జూదం ఆడుతున్న 7గురిని అరెస్టుచేసి వారివద్ద రూ.13330 స్వాధీనం చేసుకున్నట్టు రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కోండ్రు ఇంటింటి పర్యటన



పర్యటిస్తున్న కోండ్రు

రాజాం, జనవరి 21: కోండ్రు మురళీ మోహన్ ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని తెలగ వీధిలో నాయకులతో కలిసి పర్యటించారు. చంద్రబాబునాయుడు రూకల్పన చేసిన మినీ మేనిఫెస్టోను వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పనిచేసేలా దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో డీఎస్సీకి దిక్కులేదని, పోలీసు ఉద్యోగాలు భర్తీకాలేదన్నారు. ఇంటింటికీ పర్యటించిన కోండ్రుకు మహిళలు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జారిపడిన వ్యక్తి మృతి

కొమరాడ: రైల్వే ట్రాక్ పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు ఎస్ఐ నీలకంఠ తెలిపారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన కథనం ప్రకారం హర్యానా రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్ ఒడిశాలోని మునిగూడలో ఉన్న భార్య, పిల్లల వద్దకు వెళ్లేందుకు ట్రైన్ ఎక్కాడు. మునిగూడలో దిగవలసిన అశోక్‌కుమార్ గుమడ రైల్వేస్టేషన్‌లో దిగి బంధువులకు సమాచారం ఇచ్చాడు. బంధువులు వచ్చేలోగా ట్రాక్ వెంబడి నడుచుకుంటూ ఖేర్జిల అండర్ గ్రౌండ్ సమీపంలో జారిపడిపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సాలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండ లంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పాచిపెంట ఎస్ఐ పొదిలాపు నారాయ ణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన బవిరెడ్డి పవన్ కుమార్(25) మోటార్ సైకిల్‌పై విజయనగరం వెళ్లి శనివారం రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన పాచిపెంట సమీపానికి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి యడ్ల చెరువు వద్ద చెట్టుకు ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

రేగిడి: మండలంలో లక్ష్మీపురం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తి వద్ద నుంచి 45 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంక్రాంతి నెలలో 8 పేకాట శిబి రాలపై దాడులు నిర్వహించి లక్షా పదిహేను వేలు నగదుసీజ్ చేయగా, పది గ్రామాల్లో మద్యం కేసుల్లో 500 మద్యం బోటిళ్లను పట్టుకొన్నట్లు వెల్లడించారు.

కోడి పందాలపై దాడి

రామభద్రపురం: మండల పరిధిలోని కోటశిర్లాం గ్రామంలోని అలుగోలు కల్లంవద్ద ఆదివారం కోడిపందాలపై పోలీసులు దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి వీరివద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.530 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

- 41వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె
- ధర్నాకు బయలుదేరిన పలువురు గృహ నిర్బంధం

సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారంతో 41వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తమ పట్ల ప్రభుత్వం కక్ష దోరణి చూపడం తగదన్నారు. ఇదిలా ఉండగా పలువురు అంగన్‌వాడీలు విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు పయనమయ్యారు. దీంతో వారిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


కొత్తవలస: నిరసన శిబిరంలో అంగన్‌వాడీలు


రాజాంరూరల్: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



గజపతినగరం: 41 రూపంలో కూర్చుని నిరసన


ఎస్.కోటలో..


సాలూరు: మద్దతు తెలుపుతున్న సంధ్యారాణి

బడ్జెట్‌లో కోత పెట్టడం సరికాదు

గుమ్మలక్ష్మీపురం: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం గడువును మరో పదేళ్లు పెంచామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీ కులాల వారికి ప్రభుత్వ బడ్జెట్‌లో పూర్తిగా కోత పెట్టడమే కాకుండా ఇచ్చిన నిధులు కూడా నవరత్నాలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని టీడీపీ కురుపాం నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆరోపించారు. ఆమె ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 16.4 శాతం ఎస్సీలు, 5.3 శాతం ఎస్టీలు ఉన్నారని, అయితే మూడేళ్లకు ఎస్సీలకు సంబంధించి రూ.16వేల కోట్లు, ఎస్టీలకు సంబంధించి నాలుగు వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించడం అన్యాయమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కచ్చితంగా కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు కూడా ప్రభుత్వం స్వాహా చేస్తే హరిజన, గిరిజనులు ఏ విధంగా అభివృద్ధి చెందుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పలు ఎస్సీ కార్పొరేషన్, ఐటీడీఏలను నిర్వీర్యం చేశారని, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని హెచ్చరించారు.

స్థానిక గిరిజనులకే టిక్కెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

భామిని: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఎస్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక గిరిజనులకే టిక్కెట్లు ఇవ్వాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నకిలీ గిరిజనులకు టికెట్లు కేటాయిస్తే ఎన్నికల్లో ఓడిస్తామన్నారు. తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణపత్రాలతో నిజమైన గిరిజనుల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌ను పక్కదారి పట్టించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందన్నారు. ఈనెల 27న ఎస్టీ అరకు పార్లమెంట్ కేంద్రంలో గిరిజన జేఏసీ నిర్వహించనున్న మేథోమధన సదస్సును మేధావులు, విద్యార్థి యువజన విభాగం హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక జిల్లా జాయింట్ కార్యదర్శి పిరపాక శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు నిమ్మల మోహన్‌రావు, ఊయక సింహాచలం, కీర్తిరాయి సుగ్రీవులు, కద్రక లక్ష్మీనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలంతా అభిప్రాయాలను తెలియజేయండి

బెలగాం: జిల్లాలోని గిరిజనులు 'ఆదివాసీ గొంతుక' ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి తెలిపారు. ఆదివారం గిరిజన భవన్‌లో ఆదివాసీ గొంతుక ప్రజాభిప్రాయ సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గిరిజనులు దశాబ్దాల కాలంగా పాలక వర్గాల దోపిడీకి, మోసాలకు గురవుతున్నారని అన్నారు. మౌలిక వసతులు కల్పించకుండా, అభివృద్ధి చేయకపోయినా నాయకుల మోసపూరిత కుట్రలకు బలవుతున్నామని తెలిపారు. గిరిజనులను మేల్కొల్పడానికే ఆదివాసీ గొంతుక ప్రజాభిప్రాయ సేకరణలో భాగమై వారి అభిప్రాయాలను తెలియ జేయాలని కోరారు. వివరాల కోసం 9014875313 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు మల్లిపురం జగదీష్, మండంగి రమణ, రామస్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నాయకుల డుమ్మా

కొత్తవలస: విశాఖపట్టణం జిల్లా, భీమిలిలో ఈనెల 27న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సమావేశం కోసం ఆదివారం కొత్తవలసలో ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్యనాయకులు డుమ్మా కొట్టారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వెంట తిరిగే అనుచరులు మాత్రమే హాజరయ్యారు. ఎస్.కోటకు చెందిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొత్తవలసకు చెందిన కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వీరి అనుచర నాయకులు, కొత్తవలస జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపీపీ ఎం.సరస్వతి తదితరులెవరూ హాజరుకాలేదు. అలాగే నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన మెజార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు హాజరు కాలేదు.

గమ్యం చేరుకునేదెలా?


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రజలు

పార్వతీపురంటౌన్: ఓ వైపు రైళ్లు రద్దు, మరో వైపు బస్సుల కొరతతో తమ గమ్యస్థానాలను చేరుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. పండుగకు తమ స్వగ్రామాలకు వచ్చి వెళ్లాలనుకునే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ బస్సు డిపో నుంచి విశాఖ, విజయవాడ, హైదరాబాదు తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వలస ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పార్వతీపురం మీదుగా వెళ్లే రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్సులే శరణ్యమయ్యాయి. గంటల కొద్దీ కాంప్లెక్స్‌లో నిరీక్షణ చేసి తమ గమ్యస్థానాలను చేరుకోనేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు.

ముత్యాలమ్మ జాతరకు సర్వం సిద్ధం

మక్కువ: మండలంలోని కవిరిపల్లి, తోటవలస, నాయుడువలస, బట్టివలస, సన్యాసిరాజపురం గ్రామాల ఆరాధ్యదేవత, శంబర పోలమాంబ తోబుట్టువు శ్రీ ముత్యాలమ్మ జాతరకు సర్వం సిద్ధమయ్యింది. పోలమాంబ జాతరతో పాటు ముత్యాలమ్మ జాతర ఏటా ఒకేసారి నిర్వహిస్తారు. రోజూ రాత్రి సమయంలో అమ్మవారి ఘటాలను ఊరిలో ఊరేగిస్తారు. గ్రామస్థులు అందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఘటాల తిరువీధిలో పాల్గొని, నృత్యాలతో ఆనందంగా పండుగ జరుపుకుంటారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఘటాలకు పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకుంటారు.

ఒట్టిగెడ్డపై రెండు వంతెనలు ప్రారంభం

సాలూరు రూరల్: పాచిపెంట మండలం మోసూరు, మాతుమూరు వద్ద ఒట్టి గెడ్డపై రెండు వంతెనలను ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. సాలూరు నియోజకవర్గంలో 25 రహదారుల పనులు ప్రారంభించగా, వాటిలో 16 పనులు పూర్తయ్యాయన్నారు. మరో 9 రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల, జడ్పీ వైస్ చైర్మన్ కొరజన్ని సింహాచలం, వైసీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ధనంజయరావు, బోను మురళి పాల్గొన్నారు.

పల్లకిలో డిప్యూటీ సీఎం


డిప్యూటీ సీఎంను పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: మోసూరు గ్రామంలో ఆదివారం ఒట్టిగెడ్డపై వంతెనను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన్ని గ్రామస్థులు పల్లకి ఎక్కించి ఊరేగించారు. తొలుత పల్లకి ఎక్కడానికి డిప్యూటీ సీఎం నిరాకరించారు. అయితే కొద్ది నెలలకే వంతెన నిర్మాణం పూర్తి చేయించినందుకు పల్లకి ఎక్కి తీరాల్సిందేనని గ్రామస్థులు పట్టుబట్టారు. దీంతో డిప్యూటీ సీఎం పల్లకి ఎక్కారు. కొద్ది దూరం వెళ్లగానే ఆయన దిగిపోయారు. తాను పల్లకి ఎక్కుతున్నట్టు కాదని, ప్రజలకు మంచి పనులు చేస్తున్న ప్రభుత్వానికి పల్లకీ మోతగా భావిస్తున్నట్టు డిప్యూటీ సీఎం రాజన్నదొర తెలిపారు.

నిబంధనలు పాటించాలి



పాలకొండ: ఆర్టీసీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: రహదారి భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వాహనచోదకులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమం లో ట్రాఫిక్ ఎస్ఐ రాజారావు, ఉజ్వల స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలి

పాలకొండ: ఆర్టీసీ బస్సు డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు, డిపో సిబ్బందితో డీఎం మాట్లాడారు. గ్యారేజీలో మెయింటెన్స్ పూర్తిస్థాయిలో జరిపి ఎక్కడ లోపాలు లేకుండా చూడాలన్నారు.

ఎస్ఈబీ ఎస్ఐలకు స్థానచలనం

విజయనగరం క్రైం: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో విభాగంలో వివిధ సెబ్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐలుగా పనిచేస్తున్న 11 మందిని రాష్ట్ర ఎస్ఈబీ కమిషనర్ ఆదేశాల మేరకు బదిలీ చేస్తూ విశాఖపట్టణం డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో జిల్లా ఏఎస్పీ వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీఅయినది
1.పి.జాన్‌ప్రసాద్	సెబ్-విజయనగరం-1	సెబ్-పాయకరావుపేట
2 వీఎల్ కరుణలత	సెబ్-విజయనగరం-2	సెబ్- ఆముదాలవలస
3 ఈ.రామకృష్ణ	సెబ్-భోగాపురం	సెబ్-పొందూరు
4.పి.సత్యనారాయణమూర్తి	సెబ్-చీపురుపల్లి	సెబ్-అరకు
5. పి.నాగలక్ష్మీ	సెబ్-నెల్లిమర్ల	సెబ్-రణస్థలం
6. పి.అప్పారావు	సెబ్-గజపతినగరం	సెబ్-చోడవరం
7.ఎస్.రమ్యశ్రీ	సెబ్-ఎస్‌కోట	సెబ్-గాజువాక
8.పి.నరేంద్రకుమార్	సెబ్-కొత్తవలస	బీఎంపీపీ-ఇచ్ఛాపురం
9. పి.చిన్నంనాయుడు	సెబ్-బొబ్బిలి	సెబ్-భీమిలి
10.ఎస్.పిచ్చేశ్వరరావు	సెబ్-రాజాం	పురుషోత్తపురం-సీపీ
11.జి.గిరీష్	డీటీఎఫ్ విజయనగరం	కంట్రోల్‌రూం డీసీ సెబ్, విశాఖ

బదిలీ అయిన వారు వెంటనే రిలీవ్ అయి, కొత్తగా బదిలీ అయిన ప్రాంతంలో వెంటనే చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్మీ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

గంట్యాడ: నరవ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి సుంకరి బొడ్డునాయుడు కనిపించడం లేదంటూ ఆదివారం గంట్యాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. బొడ్డునాయుడు సెలవులకు ఇంటికి వచ్చి, తిరిగి ఈనెల 3వ తేదీన బెంగుళూరులో ఉన్న ఆర్మీ క్యాంపునకు ఇంటి నుంచి బయిలుదేరి వెళ్లాడు. అయితే ఆ రోజు నుంచి ఆయన ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి ఉన్నట్టు వస్తోంది. అలాగే బెంగుళూరు ఆర్మీ క్యాంపు వద్దకు కూడా ఆరా తీయగా అక్కడకు రాలేనట్లు సిబ్బంది తెలిపారు. దీంతో బొడ్డునాయుడు తండ్రి రమణ గంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్‌సీ గణపతిరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటరమణకు టీడీపీ నాయకుల పరామర్శ

పార్వతీపురం రూరల్: పీఆర్ఎన్‌వలస గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు పిన్నింటి వెంకటరమణ తల్లి మృతిచెందడంతో పార్టీ నేతలు ఆదివారం ఆయన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో తోపాటు పార్టీ నాయకులు కోలా వెంకటరావు, డి.మోహన్, బి.లక్ష్మణరావు, కె.ప్రదీప్, జి.రవిశంకర్, ఎం.కార్తీక్, జి.రామ్మూర్తినాయుడు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

శృంగవరపుకోట: ఎస్.కోటలో ట్రాఫిక్ సమస్యపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మురళీ దృష్టి సారించారు. ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న దుకాణదారులను వెనక్కి పంపించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.

టీడీపీలోకి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న నాగార్జున

గుర్ల: తాతావారి కిట్టలి గ్రామంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున సమక్షంలో ఆదివారం సుమారు 26 కుటుంబాలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, తిరుమల రాజు కిరణ్‌కుమార్‌రాజు, చనమల మహేశ్వరరావు, మామిడి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం ఎక్కడ?


ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు

పూసపాటిరేగ: మద్యపాన నిషేధం అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేడు మద్యం ఏరులై పారిస్తున్నారని జనసేన పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లోకం మాధవి ఆరోపించారు. స్థానిక రాజవీధిలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జలపార శివ, బావిశెట్టి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్


మాట్లాడుతున్న సన్యాసిశర్మ

శృంగవరపుకోట: స్థానిక శాఖ గ్రంథాలయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డిప్యూటీ కలెక్టర్ వేదుల వెంకట సన్యాసిశర్మ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ రాజా ఆధ్వర్యంలో గ్రూప్స్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులను కలిసి ఏవిధంగా చదవాలనే విషయంపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ తాను తన చిన్నతనంలో ఈ గ్రంథాలయంలో చదువుకున్న విద్యార్థినే అని చెప్పారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలి

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బత్తుల నీలిమ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హర్షం వ్యక్తం చేస్తు బొడ్డవరలోని తన నివాసంలో సత్కరించారు. ఆదివారం నీలిమ ఎమ్మెల్సీ రఘురాజును కలిసి అండర్-19 స్కూల్‌గేమ్స్‌లో రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపింది. ఈనెల 24 నుంచి 27వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగే ఈ క్రీడల్లో నీలిమ పాల్గొనుంది.

లెనిన్‌కు నివాళి



పాలకొండ, బెలగాం: లెనిన్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

సాలూరు: లెనిన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా నాయకుడు ఎన్‌వై నాయుడు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని పాలకొండలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యద ర్శి వర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కాద రాము, దూసి దుర్గారావు, శ్రామిక మహి ళలు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ● **బెలగాం:** ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించిన వ్యక్తి లెనిన్ అని సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో లెనిన్ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు సీతారామాలయాల్లో ప్రత్యేక పూజలు

గజపతినగరం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా స్థానిక సీతారామస్వామి ఆలయంతో పాటు బజార్ సెంటర్‌లోగల ఆలయంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సీతా రామస్వామి గ్రూపు దేవాలయాల ఈవో శ్రీరామ్ తెలిపారు. అష్టోత్తర శత సహస్ర నామార్చన, రామనామ సంకీర్తన నిర్వహించనున్నారు.

బొబ్బిలి రోటరీక్లబ్‌కు పురస్కారాలు

బొబ్బిలి: అంతర్జాతీయ రోటరీసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పాల్‌హారిస్ పేరుమీదుగా అందించే పురస్కారాలు బొబ్బిలి రోటరీ క్లబ్‌కు దక్కాయి. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు చేతుల మీదుగా బొబ్బిలి క్లబ్ ప్రతినిధులు అందుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, ఇతర ప్రతినిధులు చంద్రకిశోర్, టి.కార్తీక్, గెంబలి శ్రీనివాసరావు, సింద్రీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మ భాషను మరవొద్దు


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

ఒడిశా

రాయగడ: అతి మధురమైన అమ్మ భాషను ఎవరు మరువకూడదని, ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషలో ఉన్న మాధుర్యం మరే భాషలో దొరకదని ఒడియా భాషా సంస్కృతి జగన్నాథ సంస్కృతి పరక్రమ అధ్యక్షుడు అతుల్యకుమార్ పండా అన్నారు. నువా-ఓ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కేంద్రంలో ఒడియా భాష, సంస్కృతి, సంగీతం కళలు వంటివి భావితరాల వారికి అందించేందుకు చేయాల్సిన కృషిపై ఓ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాయగడ అటానమస్ కళాశాల ఒడియా అధ్యాపకురాలు రాజ్యలక్ష్మి దేవి మాట్లాడుతూ మన భాష, మన సంస్కృతి అనే నినాదంతో కళా సంస్కృతుల రక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్య వక్త సుధీర్‌కుమార్ నేగి, మమతాకుమారి కోర్, తత్వమసి మహాపాత్రో తదితరులు పాల్గొని ఒడియా భాషా జగన్నాథ సంస్కతి పరిరక్షణకు తీసుకోవలసి చర్యలపై మాట్లాడారు. అనంతరం ఇదే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, భాషా ప్రేమికులు, కళాకారులు పాల్గొన్నారు. సత్యకుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమం నిశికాంత్ శర్మ వందన సమర్పణతో ముగిసింది.

న్యాయం కోసం

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న బాధితులు


పోలీస్‌స్టేషన్ వరండాలో నిరీక్షిస్తున్న బాధిత కుటుంబం

గరుగుబిల్లి: సుమారు రెండు నెలల కింద ట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు. ఆ వాహనం ఆచూకీ లభ్యమైతే తమకు న్యాయం జరుగుతుందని మృతుడి కుటుంబ సభ్యులు అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రావివలసకు చెందిన యాళ్ల కిరణ్ నవంబరు 18న గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా మృతికి కారణమైన వాహనం ఆచూకీ కానరాలేదు. కిరణ్‌కు భార్య ఝాన్సీ, ఇద్దరు చిన్నారులు నిఖిల, షణ్ముఖ ఉన్నారు. గత కొద్ది రోజులుగా వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆదివారం కూడా గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీనిపై ట్రైనీ డీఎస్పీ ఎస్ఎండీ అజీజ్ మాట్లాడుతూ నిర్ధేశించిన సమయంలోనే సమాచారం ఉంటుందని, ప్రస్తుతం రెండు నెలలు కావడంతో లభ్యం కావడం లేదని తెలిపారు. ఏదిఏమైనా బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల నుంచి సమాచారం అందని కారణంగా కేసు ముందుకు వెళ్లడం లేదని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఇదిలాఉండగా కిరణ్ కుటుంబ సభ్యులు బీమాలో కూడా నమోదు కాలేదు.

క్లుప్తంగా..

కిరాణా షాపులో చోరీ

దత్తిరాజేరు: పోరలి గ్రామంలో గేదెల గణపతిరావు కిరాణా షాపులో శనివారం అర్ధరాత్రి రైసు బ్యాగులు, ఆయిల్ డబ్బాలు తదితర సామగ్రితోపాటు కొంత నగదు చోరీకి గురైనట్టు షాపు యజమాని గేదెల గణపతిరావు తెలిపాడు. యజమాని ఫిర్యాదు మేరకు పెద మానాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి: ముద్దూరు గ్రామంలో బాలి తారక్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా బొండపల్లి ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆదివారం ఆకస్మికంగా దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, 53 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అడ్వంచర్ పార్క్‌లో సందర్శకుల సందడి



సీతంపేట: స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. పార్క్‌లో ఉన్న బోటు షికారు చేశారు. జిలాల్లోని వివిధ పట్టణాలతో పాటు ఒడిశా నుంచి సందర్శకులు విచ్చేశారు. మెట్టుగూడ జలపాతం వద్ద కూడా సందర్శకులు చేరి ఉత్సాహం గడిపారు.

సన్మార్గంలో పయనించాలి

పార్వతీపురంటౌన్: యువత సన్మార్గంలో పయనించాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, శ్రీసత్యసాయి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డి.శ్రీదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంచరవీధిలోగల శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా యువజన సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు.

జరజాపుపేటలో శ్రీరాముని శోభాయాత్ర



నెల్లిమర్ల: అయోధ్యలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని జరజాపుపేటలో శ్రీరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరాముని ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు.

ఎల్ఎల్ పురంలో బైకు ర్యాలీ



పాలకొండ: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎల్ఎల్‌పురం గ్రామంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రామ సేవకులు, యువత రామాలయం వద్దకు వచ్చి ర్యాలీ చేశారు. భాసూరు, రాజుపేట, పాలకొండ, లుంబూరు, ఓని, బైక్ ర్యాలీ చేశారు.